మరల 'రంయ్' అంటూ స్కూటర్ బయ ల్దేరింది.

సన్నని తుప్పర పడుతోంది గాలిని పూర్తిగా చల్లబరుస్తూ.

"వాన వచ్చేలా వున్నదిగాని గట్టిగా పట్టుకు కూర్చో సౌమ్యా....స్పీడుగా వెళ్ళిపోదాం!" అన్నాడు రామం—తన నడుం మీద చేయివేసి పట్టుకోమన్నట్లుగా.

"పోనీయండి....ఫరవాలేదు....నాకు అల వాటే లెండి!"

స్కూటర్ స్పీడందుకుంది.

ద్రాక్షతోటలు హైద్రాబాద్ వచ్చేవారికి స్వాగత గీతాలు పలికేటందుకుగాను కట్టిన మామిడితోరణాల్లా కనబడుతున్నాయి.

'ఈ రెండురోజులూ తన స్వంత పనులకు పంగనామాలు పెట్టేయాలి!' అనుకున్నాడు హాయిగా రామం. "అంతగా అయితే ఇంకో రెండురోజులు యెక్కువ వుంటే సరిపోతుంది ఇక్కడ."

ఆలిండియా రేడియో వారి ట్రాన్స్మిటింగ్ టవర్స్ అంతపెద్ద పట్టణానికి కావలాదారుల్లా నిలబడివున్నాయి.

'విడిపోయేముందు జీవితాంతం జ్ఞాపకం వుండేలా—దాన్ని చూచినప్పుడల్లా ఈ మధుర క్షణాలే గుర్తుకువచ్చేలా-ఏదైనా ప్రజంటేషన్ యివ్వాలి సౌమ్యకు!'

మనుష్యుల కదలికలు ఎక్కువయినయి.... రిక్షాలు....ఆటోలు .... ఇంకాస్త ముందుకు వెళ్ళేటప్పటికి పొగలు గక్కే ఆర్టీసీ బస్సులు.

"హైద్రాబాద్ వచ్చేసింది సౌమ్యా!" హాయిగా అన్నాడు.

అతడి స్కూటర్ గాలిలో గజం ఎత్తున పోతోంది. దానిమీద అతడు పదడుగుల ఎత్తున మరీ కూర్చున్నాడు.

ఇక ఎంత హాయి! ఎంత హాయి!

సన్నని తుంపరపోయి చల్లని గాలే మిగిలింది.

సౌమ్య మాట్లాడలేదు.

మలక్‌పేట వచ్చేటప్పటికి రద్దీ యెక్కువయింది. బ్రేకు ఎక్కడ వేయాల్సివస్తుందో అన్నంత జాగ్రత్తగా వున్నాడు.

"జాగ్రత్త సౌమ్యా! గట్టిగా పట్టుకో!" ఆప్యాయంగా అన్నాడు.

"అలాగే."

స్లో చేస్తూ "ఏ హోటల్‌కు వెళ్దాం"అన్నాడు కాస్త వెనక్కు వంగి మెడ పక్కకు తిప్పుతూ మురిపెంగా.

"దేనికి వెళ్దామంటారు!" పెదాలు బిగించి చిన్నగా నవ్వింది.

"కాంటినెంటల్....న్యూ కాంటినెంటల్ తాజమహల్....న్యూ తాజమహల్ ....శ్రీదేవి సిద్ధార....ద్వారకా ....అయోధ్య....మధుర.... మహామాయా నీ యిష్టం ఏది కావాలో కోరుకో" అని చిన్నగా హుషారుగా అని, "పేరులో ఏమున్నది. మనకు ఏదైనా స్వర్గమే!" అన్నాడు నవ్వుతూ. బాదర్‌ఘాట్ బ్రిడ్జిని ఎండిపోయిన మూసీని చూచుకుంటూ దాటింది స్కూటర్.

"ఎటు పోనివ్వమంటావ్ చెప్పు అటువైపా యిటువైపా....ఎటువైపు!"అన్నాడు స్లో చేస్తూ ముందున్న మూడు రోడ్లవైపు చూస్తూ.

"ఒక్కక్షణం ఆపుదురా!"

"దేనికి."


"ప్లీజ్!"

"ఓకే!"

సౌమ్య స్కూటర్‌మీద నుంచి దూకినట్లుగా దిగింది. కాస్త ముందుకు వంగి అతడి కాళ్ళ దగ్గరున్న హ్యాండ్‌బ్యాగును చటుక్కున చేతిలోకి తీసుకొని, "థాంక్యూ మిస్టర్ రామం. థాంక్స్ ఎలాట్!" అంటూనే—ఆమె చేస్తున్న దేమిటో అర్థంగాక బిత్తరపోయి—కోలుకుండేలోగానే పక్కన నిలబడివున్న ఖాళీ ఆటోలో కూర్చుని, "థాంక్యూసర్!" అంటూనే ఒకసారి ముత్యాలు వెదజల్లుతున్నట్లుగా హాయిగా నవ్వేసి "పోనీయ్!" అన్నది తల ఎగరేస్తూ, ఆటో, డ్రైవర్‌తో.

సౌమ్య అలా తల ఎగరవేసిన తీరు—మిస్టర్ రామం నీలాంటి వాళ్ళను ఇంతవరకూ లక్షమందిని చూచాను....నన్ను నేను ఎలా కాపాడుకోవాలో నాకు తెలుసు....దానికోసరం ఎన్ని కథలైనా చెప్పి మిమ్మల్ని డింకీలు కొట్టించగలదని గుర్తుంచుకో ఈ సౌమ్య—అన్నట్లుగా వున్నది!! □

# సిల్లీ




'రాజ్‌కుమార్ మెహ్రా'

"హోయ్ హోయ్! ఈ రోజాదివారం"అన్నాడు రావునాథం నిద్దట్లో పలవరిస్తున్నట్లు.

"అయితే ఈవేళ మనకు వంట పనిలేదన్న మాట. హోయ్........హోయ్........ఆదివారం" అన్నది పద్మావతి కాఫీ కప్పుతో మంచం పక్కనే నిలబడి.

"మైగాడ్! ఆదివారాన్ని సోమవారంగా మార్చకు" అన్నాడు రామనాథం లేచి కూర్చుని కాఫీ కప్పు అందుకొంటూ.

"అయితే ఈ రోజు నా కన్ని పనుల్లో మీరు సాయం చేయాలన్న మన ఒప్పందాన్ని మర్చిపోగూడదు" అంది పద్మావతి.

"అలాగే. కాని, నా సహాయాన్ని నువ్వు తిరస్కరించగూడదు" బాత్రూంవేపు నడుస్తూ అన్నాడు రామనాథం.

"నాన్న ఈజ్ ఎ గుడ్ బాయ్" అన్నాడు ఓ మూల కూర్చొని చరిత్ర పాఠం చదువుకొంటున్న సుపుత్రుడు చిరంజీవి.

టిఫిన్ తీసుకోడం పూర్తయ్యేక, పద్మావతి బాత్రూంవేపు నడుస్తూ, "నే స్నానం చేసొస్తా, కాస్త వాడి చదువు సంగతి చూడండి" అంది.

"సారీ పద్మా! నువ్వు చేయబోయే ప్రతి పనికి నేను సాయం చేయాలన్న విషయం మర్చిపోతున్నావ్" అన్నాడు రామనాథం సీరియస్‌గా.

"వాడ్డూ యూ మీన్?" పద్మావతి ఆశ్చర్యంగా చూసింది.

"పీపు రుద్దాలి గదా నేను" చిలిపిగా అన్నాడు రామనాథం.

"షటప్!" చిన్న చిర్నవ్వుతో బాత్రూం తలుపు భళ్ళున మూసుకొంది పద్మావతి.

ఆ క్రితం రోజే పోస్టులో వచ్చిన కొత్త మాసపత్రికలో రావిశాస్త్రి రాసిన గెస్ట్ ఎడిటోరియల్ చదువుతూ తన్మయత్వంలో మునిగిపోయాడు రామనాథం.

ఎ....క్క....డో వున్న హైద్రాబాదును రాజధానిగా చేసుకొని, ఆ ఊరు బతుకుతోంది. ఆ ఊళ్ళో పేదలు పనిజేయడానికో పంచదార మిల్లుంది. అ పంచదారను కూలీలకు బ్లాకులో అమ్మడానికి చాలా దుకాణాలున్నాయి. ఎగ్రికల్చర్ వాళ్ళ ఆఫీసులు మైన్ రోడ్లోను, గోడౌన్లు ఊరికి ఉత్తరంగా మారుమూలల్లో అన్నిటికీ అనుకూలంగానూ వున్నాయి. ఫారెస్టర్ వారి కార్యాలయం మాంచి జన సమ్మర్దం కలిగిన ప్రాంతంలో, అతి పకడ్బందీగా కట్టిన భవంతిలోనూ, ఫారెస్ట్ మాత్రం ఆ ఊరికి పదిమైళ్ళ దూరంలోనూ వుంది. పాలప్రాజెక్ట్ ఆఫీసరు నోట్లోనే కాకుండా ఆ ఊళ్ళోనూ బూతులున్నాయి. 'భవనాలు, రహదారుల' వారి ఆఫీసు సరైన రోడ్డులేని ప్రాంతంలో, తనమీద పడిన మంచు బిందువుల్ని సైతం వృథాపోనీక, లోపలికే ఇంకించుకొనే ఉదారబుద్ధి కలిగిన ఓ భవనంలో అతి పదిలంగా వుంది. ఆ ఆఫీసు ఫైల్సన్నీ ఎండాకాలంలో చెరువునుండి బయటపడిన చేపల్లా ఆ భవనపు పైభాగంలో ఎండుతూ వుంటాయి, వర్షాకాలంలో గొడుగుల్లా తడుస్తూ వుంటాయి. ఆ భవనం పక్కనే ఏంటీకరెప్షన్ వారి ఆఫీసుంది. దానికెదురుగ్గా ఓ ఖరీదైన హోటలూ, మరింత ఖరీదైన ఓ లాడ్జింగ్ వున్నాయి. ఆ లాడ్జి కింది భాగంలో ఓ పెద్ద బారుంది. అంచేత 'మద్యనిషేధం మంత్రులూ', కార్యకర్తలూ తరుచూ అక్కడే సమావేశ మవుతుంటారు. ఆ ఊరికి మరో మూల ఎస్పీ దొర వారి కార్యాలయం మరేవో కొన్ని అవసరమైన ఆఫీసులూ వున్నాయి. కలెక్టరు వారి కార్యాలయం కూడా ఆ ఊళ్ళోనే వుంది. అవేకాక, పెద్దపెద్ద కాలేజీలు, వాటికాధారణమైన హైస్కూళ్ళు వీటికి పునాదులు వేసే ఎలిమెంటరీ స్కూళ్ళు క్లబ్బులు, వైన్ షాపులూ, సినిమా హాళ్ళు, బ్రోతల్ హౌసులూ, యింకా చాలా చాలా ఉన్నాయి.

అంచేత....అయ్యో....! సారీ! అది ఊరు కాదు, పట్నం.

ఆ పట్నంలో ఓ పెద్ద ఆఫీసులో చిన్న గుమాస్తాగా పన్చేస్తున్నాడు రామనాథం. అతన్దీ ఊరు కాదు. అందువల్ల పది సంసారాలు మూకుమ్మడిగా కాపురం చేస్తున్న ఓ పెద్ద ప్రహరీలో ఓ చిన్న వాటాకి వందకి మరో ముప్పై తగ్గించుకొని అద్దెకడుతూ కాపురం చేస్తున్నాడు రామనాథం, తన బరువు బాధ్యతల్తో. (బరువు: భార్య: బాధ్యత: కొడుకు)

ఆ పది సంసారాల ప్రహరి ముందు విశాలమైన వందడుగుల రోడ్డుంది. అది సిమెంటు రోడ్డు కావడాన, మంత్రులు తమ ప్రయాణాలను ఆ రోడ్ల మీదే చేస్తారు. తరచు మంత్రుల







కాకిముక్కుకి దొండపండులా నా? చభా - నీకోడ్రస్సుబాలా బావుందోయ్ - కాకపోతే - వీధి నకుకల ఉంటాయనే నాబాధ!!

తాకిడివల్ల ఆ రోడ్డు అతిశుభ్రంగా, ఆల్విన్ ఫ్రిజ్‌లా వుంటుంది, కాని చల్లగా వుండదు. ఆ రోడ్డుమీదకు వంగిచూసే ట్యూబ్‌లైట్లు, ఎప్పుడో పోగొట్టుకున్న పాతరూపాయి కోసం దిగులుగా వెతుక్కొనే దరిద్రుడి కళ్ళలా ఉంటాయి. ఆ రోడ్డు మధ్య గీసిన తెల్లటి గీతలు, సిద్ధాంతాలకీ, ఆచరణకీ మధ్య గీసిన గీతల్లా వుంటాయి. ఆ రోడ్డు అన్ని వేళలా జనసమ్మర్దంగా వుంటాని క్కారణం అటు చివరున్న సినిమా హాళ్ళు, ఇటుచివరున్న రైల్వేస్టేషనునూ. రిక్షాలు ఒదిగొంగి కూలీల్లానూ బస్సులు భయంకరంగా పోలీసుల్లానూ, కార్లు గవర్నర్లలా గంభీరంగానూ ఆ రోడ్డు మీద పోతుంటాయి.

అన్నట్లు ఆ రోడ్డుపేరు పంచశీలా రోడ్.

ఆ పదిసంసారాల ఇంటిముందున్న విశాలమైన వందడుగుల రోడ్డుకు ఆ వేపు చాలా ఖరీదైన భవంతులున్నాయి. అన్ని భవంతుల కంటె ఎక్కువ ఎత్తుగా నిల్చున్నా ఆ భవనం ఎమ్.ఎల్.ఏ. రావుగారిది. ఆ రావుగారి పూర్తి పేరు మల్లెపొదల సంపెంగ నాసిక శంఖారావ్. ప్రస్తుతం వారు హైద్రాబాదులో వుంటున్నారు. వారి పెద్దబ్బాయ్ డెహ్రాడూన్లోనూ, వారి చిన్నమ్మాయ్, ఋషీవాలీలోనూ చదువుకొంటున్నారని రావుగారు చెబితే తెలుస్తుంది. చదువు తప్ప అన్నీ చేస్తారన్న విషయం ఆ పిల్లల గురువుల్నడిగితే తెలుస్తుంది. హైద్రాబాదులో రావుగారి సతీమణి గొప్పలు చెప్పుకుంటూ బ్రతికేస్తున్నారని వారి బంధువులవల్ల తెలుస్తుంది. రావుగారు మంచినీళ్ళు తాగరని, స్కాచ్ మాత్రమే పుచ్చుకుంటారని, తిండి తినరని మనుషుల్ని మాత్రమే తింటారని, వారి సర్కిల్లో వారి స్నేహితుల్ని విచారిస్తే తెలుస్తుంది. ఆయన్ని ఎంయల్యేగా ఎన్నుకొన్న తర్వాత, ప్రజలెంత విచారించారో, విచారిస్తున్నారో ఆ ప్రజల్నడిగితేనే తెలుస్తుంది.

ప్రస్తుతం ఆ ఎంయల్యేగారింట్లో ఓ జిల్లా ఆఫీసరుగారు కాపురముంటున్నారు. వారి తండ్రిగారు అదేదో జిల్లాకి పరిషత్తు చైర్మన్. వారి మామగారు మాత్రం ఉద్యోగంతో విసిగి వేసారి, ఇచ్చి పుచ్చుకోవడం మీద నమ్మకమూ గౌరవమూ వున్న మనిషి కావడాన ప్రజలకు నోట్లిచ్చి, ఓట్లు పుచ్చుకొని ఎంపీగా మారేరు. ఆ యంపీగారికి, ఈ ఎంయల్యేగారికి చచ్చేంత దోస్తీ కావడాన ఎంపీగారి అల్లుడిగారికి ఆ భవనం ఎంయల్యేగారు అతి చవకగా అయిదు వందలకే అద్దెకిచ్చారు. ఆ అద్దెను ఎంపీగారే చాల రకాలుగా ఎడ్జస్టు చేయిస్తారు. ఆ ఇద్దరికి

ఒకరిమీద ఒకరికి గౌరవ ముండటంవల్ల వారి వారి గౌరవ మర్యాదల మధ్య అల్లుడుగారు అతిహాయిందాగా ఆ భవంతిలో బ్రతికేస్తున్నారు.

అలాని అల్లుడుగారు తక్కువ తరగతి ఆఫీసరువారు కాదు. వారు ఉద్యోగాలు వేస్తారు తీస్తారు. వేయించనూగలరు, తీయించనూ గలరు. వారికి ఉత్కళ యూనివర్సిటీలో ఎం.ఏ చదివిన భార్యా, స్థానిక లిటిల్‌ఫ్లవర్‌లో అతి సీరియస్‌గా కలెక్టరు ఉద్యోగానికి పునాదులు వేసుకొంటున్న ఏడేళ్ళ కొడుకూ వున్నారు. తల్లి సన్నగా, నాజూగ్గా వుంటుంది గనుక, కొడుకూ సన్నగా, తెల్లగా, నాజూగ్గానే వుంటాడు. తల్లి అందంతోపాటు, తండ్రి గాంభీర్యాన్ని ప్రసాదించిన ఆ దేవుడు తాత గారి ధైర్యాన్ని, మొండితనాన్ని కూడా పొది గాడు చినబాబులో. అల్లుడుగారు పెదబాబుగారు కాబట్టి, వారి కుమారరత్నం చినబాబుగారు.

చిత్రం: చినబాబుకి, చిరంజీవికి స్నేహం. పెదబాబుగారు లేనపుడు చినబాబు తన కాంపౌండుగేటు కవతల విశాలమైన లాన్లో నిలబడి, వీధి వరండాలో నిల్చున్న చిరంజీవిని పిలుస్తాడు. చిరంజీవి చిన్నగా నవ్వి, చేయూపి ట్రాఫిక్‌ని తప్పుకొంటూ చినబాబింటికివెళ్తాడు. చినబాబు ఇంగ్లీషులోనూ, చిరంజీవి తెలుగు లోనూ పలకరించుకొని, కబుర్లు చెప్పు కొంటారు, ఆడుకొంటారు. చినబాబు నవ్వులు కూడా ఇంగ్లీషులోనూ, చిరంజీవి ఫీలింగ్స్ తెలుగులోనూ వుంటాయి. చినబాబుకి తెలుగు తెలుసు, కాని మాట్లాడరు. చిరంజీవికి చిన బాబు ఇంగ్లీషు అర్థమౌతుంది కాని సమా ధానం చెప్పలేడు తిరిగి. వాళ్ళిద్దరి స్నేహం అలానే పెరిగి పెద్దదయింది. కాని చినబాబుకి, చిరంజీవిని యెలా 'ట్రీట్' చేయాలో తెలుసు. ఎంత స్నేహితుడైనా అంతస్థుల తారతమ్య ముంది. అవును మరి? చినబాబు రెండంతస్థుల భవంతిలోనూ, చిరంజీవి ఎత్తరుగుల పెంకు టింట్లోనూ వుంటున్నారు మరి.

ఎడిటోరియల్ చదివి పూర్తయ్యాక, తృప్తిగా తల పంకించి, సంతృప్తిగా వెనక్కి వాలేడు, రామనాథం. అతని కీర్తివంతమైన రచయిత రావిశాస్త్రి అని మరోసారి అనుకోకుండా వుండలేకపోయాడు.

ఆలోచనా మేఘాల్లో మైమరచిపోయిన రామనాథం, చిరంజీవి పలకరింపుతో తేరు కొని, అమాయకంగా నిల్చున్న చిరంజీవి న్చూసేడు. చిరంజీవి, "నాన్నా! ఈ రోజు ఆది వారం, కాసేపు చినబాబింట్లో ఆడుకొంటా నాన్నా!" అన్నాడు.

"చినబాబా! వాడెవడు?" అడిగాడు రామ నాథం.

"ఆ పెద్దిల్లుంది చూడు నాన్నా! వాళ్ళ బాబు" అన్నాడు చిరంజీవి చేయి చాచి అక్క డెక్కడో వున్న భవంతిని దివ్యదృష్టితో చూడ మన్నట్లుగా హెచ్చరిస్తూ.

"ఎవరూ! ఎంపీగారి మనవడా?" అడిగాడు రామనాథం.

"కాదు, పెదబాబుగారి చినబాబు నాన్నా!" జవాబిచ్చేడు చిరంజీవి.


"అదేలేరా బాబు! సముద్రంలో నీరు, ఏ ప్రాంతంలోనైనా ఉప్పగానే వున్నట్లు, పోలీసుల బుద్ధి ఏ రాష్ట్రంలోనైనా ఒకేలా వున్నట్లు, నువ్వన్నది, నే చెప్పింది కూడా ఒకటే" అన్నాడు రామనాథం.

"పో నాన్నా! నాకు తెలియనివన్నీ ముందుగా నేర్చేసుకుంటావ్" అన్నట్లు నిలబడిపోయేడు చిరంజీవి.

"సరేపో! నువ్వేదో చదువుకొంటుంటే చూడమని ఆదేశించింది మీ అమ్మ. నిన్నేమో చిన్నబాబు ఆవహించాడు. పో....పోయి ఆడుకో" అన్నాడు రామనాథం పేజీ తిప్పుతూ.

చిరంజీవి వెనక్కి తిరిగి వేగాన్ని పెంచి సినిమాలో కృష్ణుడిలా అదృశ్యమైపోయాడు.

నవ్వుతూ వచ్చిన చిరంజీవిని, సీరియస్‌గా రిసీవ్ చేసుకొన్నారు చినబాబు. పలకరింపు కార్యాలయం అయ్యేక, లాన్లోనే చిరంజీవిని నిలబెట్టి "ఒన్ మినిట్" అంటూ లోపలికి పరుగెత్తారు చినబాబు. అలా పరుగెత్తి, నడిచి, మారుమూల గదిలో, విశాలమైన గదిలో, విశాలమైన మంచంమీద, అతిభ్రాంతిగా పడు




కొని, ఛేజ్ నవలని రేప్ చేస్తున్న మమ్మీతో, "మమ్మీ! చిరంజీవి హాజ్ కం" అన్నారు.

మమ్మీ విసుగ్గా కనుబొమలు విరిచి, కళ్ళెత్తకూడదని మెదడుకు ఆదేశమిచ్చి, చిన బాబు చెప్పింది విన్నానన్నట్లుగా మేను విరిచి, "సో వ్వాట్, గో....ఎండ్ ప్లే" అన్నారు చిరాగ్గా.

పద్మావతి బాత్రూంలోంచి బైటికొచ్చి, అలంకరణ ముగించుకొని బైటపడేసరికి అర గంట పైనే పట్టింది.

షికారు వెళ్ళాల్సిన రామనాథం, పుస్తకాన్ని అతిసీరియస్‌గా చదువుతూండటం, చదువుకో వాల్సిన చిరంజీవి షికారెళ్ళడం గమనించి నవ్వుకొంది పద్మావతి. కాని—

చిరంజీవి ఏడుస్తూ ఇంట్లో కొచ్చాడు. రామనాథం ప్రశ్నార్థకంగానూ, పద్మావతి ఆశ్చర్యంగాను చిరంజీవిన్చూచి, "ఏఎంమైందు దిరాకుర్రా?" అడిగారు ఒకేసారి. చిరంజీవి సమాధానం చెప్పలేదు.

"ఏమైందిరా?" అడిగాడు రామనాథం.

"ఎందుకురా?" ఓ అరక్షణం ఆగి పద్మావతి అడిగింది.

చిరంజీవి అతికష్టంగా కన్నీళ్ళని ఆపు కొంటూ "చినబాబు కొట్టేడు" అన్నాడు.

"ఎందుకు?" అడిగేరిద్దరూ ఒకేసారి.

"మరేమో, అక్బరు గొప్ప రాజటగా?"

"నువ్వు కాదన్నావా?"

"....ఉహుఁ... తాజమహల్ అక్బరు కట్టిం చాడని అన్నాడు చినబాబు. కాదన్నాను...."

"....అందుకని?"

"అందుకని కొట్టేడు."

రామనాథం ఆలోచనలో పడ్డాడు. చీడ మొఖం ఆఫీసరు పీడకలలుగనే కళ్ళతో అతి భయానకంగా తను చెప్పిన సరైన జీవోలను ఖండించటం గుర్తొచ్చింది. సూపర్నెంటుకు తను రూల్సు చెప్పాల్సిరావడం గుర్తొచ్చింది. ఈ రెండు కారణాలవల్ల తను సీటు మారడం గుర్తొచ్చింది. స్టేషన్ మారడం గుర్తొచ్చింది. అక్కడ్నుంచి జిల్లా మారడం గుర్తొచ్చింది. కాదన్నందుకు, వాళ్ళు చెప్పినదానికి 'చెంచా' కొట్టనందుకు తనెన్ని బాధలు పడాల్సివచ్చింది. ఇక్కడ కూడా అవే పోలికలున్న ఆఫీసర్ను, సూపర్నెంటును చూసి నోరు నొక్కుకోవాల్సిన పరిస్థితి ఏర్పడినందుకు విచారమేసింది. అయినా తనకు ధైర్యముంది తనను మెచ్చే ఆఫీసర్ను తను రిటైర్ అయ్యేలోపల తారసపడకపోతాడని.

అందుకే ఆఫీసు వ్యవహారాల్లో గంగిరెద్దులా తలూపడం మానేశాడు. ఇతరులకు జరుగుతున్న అన్యాయాల్ని ఖండించటం అదీ చేస్తున్నాడు. అందుకు ఎదురు దెబ్బలు తగులుతూనే వున్నాయి. అయినా తను భయపట్టం లేదు. అలాటి తన కడుపున పుట్టి, తనకు తెలిసిన నిజాన్ని చెప్పి, ఎదుటివాడి తప్పును పట్టిచ్చి దెబ్బతిని....అది తను విని మౌనం వహించితే, యింకెప్పుడూ తప్పుల్ని ఖండించడం మానేసి పిరికివాడై పోతాడేమోనని తట్టి భయంవేసింది రామనాధానికి .అందుకే చిరంజీవిని దగ్గరకు పిలిచాడు రామనాధం.

"చూడు నాన్నా! చినబాబు నిన్నెందుకు కొట్టాడు?"

"అందుకే" అన్నాడు చిరంజీవి మళ్ళీ చెప్పే ఓపిక లేక.

"అంటే....అదే ఎందుకు?"

"అక్బర్ గొప్ప రాజట, తాజమహల్ కట్టించాడట. నేనేమో....అక్బర్ గొప్ప రాజే గాని, తాజమహల్ కట్టించలేదన్నాను.... అందుకు."

"నిజంగా అందుకేనా?"

తలూపాడు చిరంజీవి.

"నో....నువ్వబద్ధం చెబుతున్నావు గదూ? అందుక్కాదు గదూ?"

చిరంజీవి క్రోధం, ఉక్రోషం, యేడుపు వచ్చాయి. అవి అన్ని రకాలుగా బైట కొచ్చాయి. కోపం గొంతులోంచి, ఉక్రోషం మొఖంలోంచి, ఏడుపు కళ్ళలోంచి. "అందుకే అందుకే కొట్టాడు. ఒట్టు....నీ తోడు....అమ్మ తోడు....దేవుడితోడు.... సరస్వతీదేవుడితోడు" గబగబా అర్చాడు చిరంజీవి హఠాత్తుగా.

"నోర్మూయ్ ఇడియట్! ఇంకెప్పుడన్నా తోడు గీడు అన్నావంటే తోలు తీస్తాను, ఫూలా ఫెనేస్...." ఆవేశపడిపోయాడు రామనాధం. కాని ఓ అరక్షణంలో తమాయించుకోగలిగాడు.

మనిషిని నమ్మని మనిషి కనిపించని దేవుడిని నమ్మడం బుద్ధి తక్కువంటాడు రామనాధం. మనిషి సృష్ట్యాది నుండి మరో మనిషితో నిజం చెప్పడం జరిగితే, ఈ దేవుళ్ళ తోళ్ళుపెట్టి నమ్మింపజేయాల్సిన అవసరముండకపోను గదా అన్న ఆలోచనతోపాటు, నమ్మించడానికి తనో దేవుడిని తోడు తెచ్చుకోవడంలో ఆ మనిషి బలహీనత కనిపించితే నమ్మడంలో ఎదుటి మనిషి బలహీనత కూడా కనిపించుతుందంటాడు రామనాధం. అంతేక, ఇలాటి మూఢనమ్మకాలకు అలవాటైన ఆ ఇద్దరూ పరస్పరం దేవుడిమీద ఒట్లు పెట్టుకుంటూ, వీలైనన్ని యెక్కువసార్లు మోసగించుకోడానికే ప్రయత్నిస్తుంటారని అతగాడి నమ్మకం. అందుకే రామనాధం అబద్ధం చెప్పడు. ఒట్లువేయడు. వేసేవాడి మీద గౌరవం చూపడు.

రామనాధం తమాయించుకొన్నాడు. పద్మావతికేసి చూసి, చిరంజీవివేపు తల తిప్పి, "చూడు బాబూ! అక్బరు గొప్పరాజే! తాజమహల్ అతను కట్టించలేదు నిజమే. నువ్వన్నది నిజమే. మరైతే ఎవరు కట్టించారో తెలుసా?" అడిగాడు రామనాధం.

మాట్లాడలేదు చిరంజీవి. మౌనంగా తలొంచుకొని, తనకు దొరకాల్సిన గుప్పెడు సానుభూతి దొరకనందుకు నిరాశగా, నిర్లిప్తంగా ఉండిపోయేడు.

"చెప్పు....తెలుసా....తెలీదా?"

తెలుసన్నట్లు తలూపాడు చిరంజీవి.

"ఎవరు?" ఆత్రంగా అడిగేడు రామనాధం.

పద్మావతికి రామనాధం ప్రసంగం అసందర్భంగా, అన్నేచురల్‌గా అనిపిస్తోంది. భర్త మీద, భర్త సిద్ధాంతాల మీద, భర్త ఆదర్శాల మీద నమ్మకముంది, గౌరవముంది. అందుకే ఓపిగ్గా ఆలోచిస్తుంది. ఎందుకు అడుగుతున్నట్టివన్నీ? చిన్నవాడు చిరంజీవి, తెలియనివి చెప్పడంకోసమా? అయితే, ఇది సందర్భంకాదు. ఇప్పుడు విచారించాల్సింది చినబాబు చిరంజీవినెందుకు కొట్టాడని? ఓదార్చవలసింది చిరంజీవిని, చినబాబుచేతిలో దెబ్బ తిన్నందుకు. అంతేకాని, తాజమహల్ నిర్మాణానికైన ఖర్చెక్కాదు విచారించాల్సింది. తాజమహల్ నిర్మాణంలో శ్రమించిన కూలీల్ని కాదు ఓదార్చాల్సింది. పద్మావతి బుర్రనిండా ఆలోచనలున్నాయి.

"ఎవరు?" మళ్ళీ అడిగాడు రామనాధం మౌనంగా నిల్చున్న చిరంజీవిని.

"ఔరంగజేబు తండ్రి, షాజహాన్" కళ్ళు తుడుచుకొంటూ జవాబిచ్చాడు చిరంజీవి.

చటుక్కున కావలించుకొని ముద్దెట్టుకొన్నాడు రామనాధం, చిరంజీవిని. అతని పితృహృదయం ఆనందంతో గంతులు వేసింది. గర్వంగా పద్మావతికేసి చూసేడు రామనాధం.

చిరంజీవి ఆనందంతో అవమానాన్ని మరిచిపోయేడు. తండ్రిని మరింత బలంగా చుట్టుకుపోయేడు.

రామనాధం వేసిన సాధారణమైన ప్రశ్నకు అతిసాధారణమైన జవాబు, 'షాజహాన్' అని మాత్రమే. అసాధారణమైన జవాబు ఔరంగజేబు తండ్రి షాజహాన్ అని. చిరంజీవి చదువు మీద రామనాధానికి నమ్మక మేర్పడింది. "వెరీగూడ్ మై సన్! వెరీగూడ్! గో ఎండ్ టెల్ హిమ్....పో....పోయి తాజమహల్ షాజహాన్ కట్టించేడని ఆ చినబాబుగాడికి మరోసారి చెప్పు. విన్నాడా .... తప్పు దిద్దుకొన్నవాడౌతాడు. లేదా తప్పు చెప్పే, ఒప్పు చెప్పిన నిన్ను కొట్టినందుకు శిక్షనుభవిస్తాడు. చూడూ నువ్వు రైటు చెప్పావు. నీకు తెలిసింది సత్యం. నువ్వు చెప్పింది నిజం. రాజ్యాంగాన్ని మార్పించగలిగే వాడి తాతసైతం, తాజమహల్ కట్టించిన వాడిపేరు మార్చలేడు. పో....పోయి మరోసారి చెప్పు. అన్నట్లు నిన్ను కొట్టేడన్నావు కదూ....వాడు నిన్ను కొడితే ఏడ్చుకొంటూ వచ్చేవు కదూ....అది తప్పు. నువ్వూ వాణ్ణి కొట్టు—ముందా పన్చేయ్. వెంటనే వెళ్ళి వాడిని కొట్టిరా—దెబ్బకు దెబ్బే—అంతేకాదు—భవిష్యత్తులో నువ్వు గుర్తుంచుకోవాల్సిందీ, ఆచరించాల్సిందీ ఇప్పుడే చెబుతాను విను, మళ్ళీ సందర్భం రాకపోవచ్చు, అవకాశమూ రాకపోవచ్చు. అందుకే జాగ్రత్తగా విను. నువ్వు తప్పు చేస్తే, నువ్వు చేసింది తప్పని రుజువైతే, నీ తప్పు నీకు తెలియచేస్తే, ఎదుటివాడితో వాదించకు. ఎదురు తిరగకు. నీ తప్పును రుజువు చేసినవాడిని గౌరవించు. అతను విధించిన ఏ శిక్షకైనా, షరతుకైనా, తలవంచు—సిద్ధపడు. కాని, నీ నిజమైన సిద్ధాంతాన్ని, నీకు తెలిసిన నిజాన్ని, ఖండించినవాడిని, శారీరకంగా ఖండించడానికూడా వెనుకాడకు. నిన్ననవసరంగా ఎవరైనా కొడితే వాణ్ని క్షమించి దేవుడిపై పోవడానికి ప్రయత్నించకు. వాణ్ని తిరిగికొట్టి తిప్పికొట్టి, శిక్షించి అతిమామూలు మనిషిగా మాత్రమే బతుకు, బ్రతకడానికి ప్రయత్నించు. అంతే....అర్థమైందా?" ఆవేశంగా, ఉద్రేకంగా అన్నాడు రామనాధం. తనకంటె ఎంతో చిన్నవాడితో మాట్లాడుతున్నానన్న ఆలోచన లేకుండా చెప్పాడు రామనాదం. తన భావాలన్నీ వాడి మెదడులోకి చొప్పించగలిగితే, ఒక్కటీ అరా అయినా తప్పకుండా అర్థమవుతాయని, మిగతావాటిని వాడు గుర్తుంచుకొని, వయసు పెరిగాక అర్థంచేసుకొంటాడని మాత్రమే ఆలోచించాడు రామనాధం.

పద్మావతికి సందేహం నివృత్తి అవడంతో లోపలికి వెళ్ళిపోయింది చిర్నవ్వునవ్వుకొంటూ. రామనాధం అంచనా తప్పు కాలేదు. చిరంజీవికి రెండే రెండు వాక్యాలు అర్థమయ్యాయి. ఒకటి తను చెప్పింది రైటు. రెండు—చినబాబు తన్ననవసరంగా కొట్టాడు కాబట్టి, తను చినబాబును కొట్టాలి. బైటికి నడిచాడు చిరంజీవి, ఏడుస్తూ కాదు. ఏడ్పించేందుకు సిద్ధపడి.

స్థిరనిశ్చయంతో బైటికి నడిచిన చిరంజీవికి చినబాబు కనిపించలేదు. కాని గేటు మూసేసి ఉండటం కనిపించింది. భోజనాల వేళవరకు కాపు కాసేడు వీధివరండాలో నిల్చుని, చినబాబుకోసం. భోజనమైందనిపించి, చిరంజీవి, చినబాబుకోసం ఎత్తరుగుల చిరంజీవి ఎత్తింటి చినబాబుకోసం యెదురుచూస్తూ వున్నాడు.

రెండు....మూడు .... నాలుగు....నాల్గున్నరైంది. సూర్యుడు ఎలక్షన్లు దగ్గరపడిన ఎంపీలా

గందరగోళంగా వున్నాడు. ఎన్నికల మీటింగ్‌కు వెళ్ళబోయే నాయకుడిలా హడావుడిగా ఉన్నాడు. వాడి, వేడి కిరణాలను ఉపసంహరించుకొన్న సూర్యుడు, అసలు రూపాన్ని దాచుకొని ప్రజలముందుకు వెళ్ళడానికి సిద్ధమవుతున్న దేశనేతలా వున్నాడు.

అపుడు....సరిగ్గా ఆ సమయంలో, ఎత్తిల్లు చినబాబు ఎత్తైన తన తండ్రితో, అందమైన తన తల్లితో, ఎత్తింటి ముందున్న లాన్లో, నీట్‌గా అమర్చిన కుర్చీలో, కూర్చుని స్నాక్స్ తింటూ, టీ తాగుతున్నారు.

చిరంజీవి ధైర్యంగా గేటు తీసుకొని, మూయకుండానే విసురుగా ముందుకు నడిచేడు. పెదబాబుగారు, భార్య అందాన్ని ఆస్వాదిస్తూ చేజ్ నవల్లోని పాత్రలకు భార్య పెదాలిస్తున్న అపురూపమైన రూపకల్పనకు ఆశ్చర్యపోతున్నట్లు నటిస్తూ, కాఫీ మాత్రమే తాగుతున్నారు. వారి మనసులో కొత్తగా చేరిన హైపిస్టూ, ఆమె ఎత్తైన గుండెలమీద కదిలే లాకెట్టూ, అందాల్ని దాచలేక సతమతమయ్యే ఆవిడ ధరించిన అతీ చిన్న జాకెట్టు కదులుతున్నాయి.

నిశ్చింతగా టీ ఎంజాయ్ చేస్తున్నది, చినబాబుగారు మాత్రమే. చిరంజీవి రాకని పెదబాబుగారుగాని, వారి భార్యగానీ గమనించలేదు. చినబాబుగారు చూసేరు బిస్కెట్ల కోసం తన తాతగారి కుక్క తన దగ్గర కొచ్చినపుడు, తను చూసే మామూలు చూపులాంటి చూపుతో. చిరంజీవి కూడా చినబాబుని చూసేడు, అతి తెలివైన అతి గురిగల వేటగాడు చేతిలో తుపాకి ఉన్నప్పుడు, అతిసమీపంలోవున్న సింహాన్ని అతినిర్లక్ష్యంగా చూసినట్లు.

"వాడ్డూయూ వాంట్?" తలెగరేసి అతి నిర్లక్ష్యంగా అడిగేడు చినబాబు, తనకు అతి దగ్గరగా నిల్చున్న చిరంజీవిని చీదరించుకొన్నట్లుగా చూస్తూ.

"తాజమహాల్‌ని షాజహాన్ కట్టించాడు" పిల్లమేఘంలా గర్జించాడు చిరంజీవి.

"నో....అక్బర్...." చినబాబు వాక్యం పూర్తిచేయలేదు.



చిరంజీవి చేయి చినబాబు చెంపను అదరగొట్టింది.

ఆ దెబ్బకు చినబాబుగారు నిర్లక్ష్యంగా వదిలేసిన తలవెంట్రుకలు ఒక క్రమపద్ధతిలో దువ్వినట్లుగా సర్దుకొన్నాయి. చిరంజీవి బాణంలా గేట్లోంచి దూసుకొచ్చాడు.

పెదబాబుగారి కళ్ళు ఆశ్చర్యంగా చూసి, క్రోధంగా మారాయి. అమ్మగారి కళ్ళు పెదబాబుగారి కళ్ళతో కలిసాయి, ఏకీభవించాయి.

చిరంజీవి మెట్లెక్కి యింట్లోకి నడిచి, వంటింట్లోకి వెళ్ళి ఓ గ్లాసెడు మంచినీళ్ళు తాగి, తన కప్‌బోర్డు తెరిచి, ఓ బిస్కెట్ తీసుకొని నములుకొంటూ, తన టేబుల్ కెదురుగా వున్న కుర్చీలో కూర్చుని, పుస్తకంలో తల దూర్చాడు.

ఉదయం నుండి చిరంజీవిని గమనిస్తున్న రామనాథం చిరంజీవి రావడం, మంచినీళ్ళు తాగడం, కుర్చీలో కూర్చుని పుస్తకం తెరవడం చూసి హాయిగా ఫీలయ్యేడు. చిరంజీవిని గొప్పవాడిగా-ఓ నిర్దుష్టమైన వ్యక్తిగా తీర్చిదిద్ద గలనన్న నమ్మకం అతనికి కొండంత ధైర్యాన్ని అంతులేని తృప్తినీ ఇచ్చింది.

అరుగుమీద అడుగుల చప్పుడవడం విని కూడా చిరంజీవి కదల్లేదు. కాని చెవులు రిక్కించాడు. ఆ వచ్చినవాడు పెదబాబుగారింట్లో చాలా కాలంగా పనిచేస్తున్న అతిచిన్న నౌకరు. రామనాథాన్ని అతిగర్వంగా—

"రామనాథం రామనాథం" అని పిల్చేడు.

రామనాథం అతివిసురుగా బైటికొచ్చి, "ఎవరు కావాలండి డబ్బా సుబ్బారాయుడు గారూ?" అని ప్రశ్నించేడు కఠినంగా.

నౌకరు తెల్లమొఖం వేసి, తమాయించుకొని, "నిన్ను పెదబాబుగారు రమ్మంటుండారు, రా పోదాం" అని సందేశాన్ని ఆజ్ఞని రామనాథంపైకి విసిరి భుజాలమీద బరువు దిగిపోగా, నిట్టూర్చాడు.

"పెదబాబా! ఎవడికిరా పెదబాబు? నీకా, నాకా?" తీక్షణంగా అడిగాడు రామనాథం.

గుక్కతిరగలేదు నౌకరుకు. ఊపిరి పీల్చుకోవడం మరిచిపోయి, హఠాత్తుగా గుర్తొచ్చిన వాడిలా గట్టిగా ఊపిరి పీల్చి, బైటికి పోనివ్వకుండా జాగ్రత్తలు తీసుకొంటూ, "మాకే.... నిన్నే.... పిల్చుకరమ్మన్నారు" అన్నారు.



"నీకు పెదబాబా! అయితే నాకేమిటి గొప్ప. పో... పోయి మీ పెదబాబునే రమ్మన్నానని చెప్పు. ఇదో....యింకో చిన్నమాట. ఈ సారి ఈ యింటిముందుకొచ్చి, 'రామనాథం' అని గాని 'నువ్వు' అనిగాని అన్నావో, ఇంకోసారి ఆ అవసరం రాకుండా నీ నాలుక కత్తిరించేస్తాను జాగ్రత్త" అన్నాడు రామనాథం.

నౌకరు స్పృహలోకొచ్చాడు. 'నేనెల్లగానే ఎనకాతలే వచ్చేత్తాడనుకొన్నాను. నయం తన్నాడు గాదు' అనుకొని బెదురు చూపులు చూసుకొంటూ, వెనక్కి తిరిగి చూసుకొంటు వెళ్ళిపోయేడు అతిచిన్న నౌకరు.

వారంరోజుల తర్వాత—

రామనాథానికి ఆంధ్రదేశంలోని ఓ మారుమూల పల్లెకు, ఆంధ్రరాష్ట్ర రాజధానికి ఇంకా దూరంగా, కాకులు దూరని కారడవికి పక్కగా చీమలు దూరని చిట్టడవికి సమీపంగా వున్న ఆ పల్లెకు ట్రాన్స్‌ఫర్ చేసినట్టు ఆర్డర్సొచ్చాయి. రామనాథంతోపాటు, చీడమొఖంతో పీడకలలు గనే ఆఫీసరువారు, ప్రధానమంత్రి పదవి తర్వాత తనదే అతికీలకమైన పదవిగా గర్వపడుతూ, జూనియర్స్‌చేత రూల్సు చెప్పించుకొనే సూపర్నెంటుగారు కూడా సంతోషించారు.

రిలీవింగ్ ఆర్డర్స్ తీసుకొని, ఆ సాయంత్రం ఎత్తరుగుల తనింటి మెట్లెక్కబోతూ, వెనక్కి తిరిగి చూసేడు రామనాథం. ఎత్తింటి ముందు లాన్లో, భార్యతో, చినబాబుతో, చిర్నవుతో ముచ్చట్లాడుతూ, కాఫీ తాగుతున్నారు పెదబాబుగారు.

రెండడుగులు వేసి వందడుగుల రోడ్డును దాటి, ఎత్తులో అతిచిన్నదిగా వున్న గేటును తెరుచుకొని, గంభీరంగా ముందుకు నడిచాడు రామనాథం. పెదబాబుగారు కాఫీ సిప్‌చేసి రామనాథం రాకను గుర్తించేడు. వారికి చెమట్లు పోసేయి, చల్లగాలిలో. అప్పుడే గుర్తించేరు గాలిలోను, తన నోట్లోను తేమ లేదని. కాఫీ మాత్రం గొంతు దిక్కుండా ఆగిపోయింది. కొడుకొచ్చి తన కొడుకు చెంపను అదరగొట్టాడు. తండ్రొస్తున్నాడు, తన్ను వాయించడు గదా!



చినబాబు నములుతున్న బిస్కెట్ ముక్కను పళ్ళు నమలడం మరిచిపోయేయి. అమ్మగారి చేతిలోని క్రీం బిస్కెట్, సిగలోని గులాబీమొగ్గ నేలమీద జారిపోయేయి.

రామనాథం ఆ ముగ్గుర్నీ, ముగ్గుర్లోనూ దాగిన, రేగిన భయాన్ని గుర్తించేడు. రామనాథం సగటుమనిషి. మనిషి, మనిషికి అపకారం చేసినపుడు అపకారం జరిగిన మనిషి ఎదురైనపుడు, అపకారం చేసిన మనిషిలో కలిగే సంఘర్షణని గుర్తించగలడు.

"నా పేరు రామనాథం" అన్నాడు రామనాథం, పెదబాబుగారికి అతిదగ్గరగా వచ్చి.

పెదబాబుగారు లోపల పనేస్తున్న నౌకర్లని సహాయంగా పిలిచేందుకు లేచినిల్చున్నారు. రామనాథం పెదబాబుకారు ఖాళీచేసిన కుర్చీలో అతి సహజంగా కూర్చొని, "థాంక్స్" అన్నాడు.

పెదబాబుగారు, అమ్మగారు, చినబాబుగారు భయంగానూ, ఆందోళనగానూ, ఆశ్చర్యంగానూ చూసారు రామనాథంకేసి. రామనాథం నిబ్బరంగానూ, సూటిగానూ, సహజంగాను, చెప్పడం ప్రారంభించేడు.

"ఈ రోజే రిలీవయ్యాను నేను. మీకు నా హృదయపూర్వక ధన్యవాదాలు. అది చెప్పేందుకొచ్చిన నాకు, మీరు చేసిన మర్యాద కూడా, మర్యాదస్తుల మర్యాదని, మన్ననని చూపుతోంది. ఇంతకీ అసలు విషయం ఏమిటంటే, మీ చినబాబుకి, మా చిరంజీవికి అతిచక్కటి స్నేహం వుంది. ఆ స్నేహాన్ని పురస్కరించుకొని, మా చిరంజీవి, మీ చిన్నబాబుతో ఆడుకోడానికి తరచు ఇక్కడికి వచ్చేవాడు. పోయినాదివారం అలానే వచ్చాడు. చినబాబుకి డబ్బుంది. అందుకని అహంకారం కూడ

వుంది. అందువల్ల తనమాట చెల్లాలన్న పట్టుదల వంశపారంపర్యంగానే వచ్చుంటుంది. చిరంజీవి మామూలు గుమాస్తా కొడుకు. అందువల్ల ధైర్యంతో కూడిన నిజాయితి, జ్ఞాపకశక్తితో కూడిన ధైర్యమూ వున్నాయి. వీళ్ళు పరస్పర విరుద్ధమైన స్వభావం గల పిల్లలు. మీ చినబాబు తాజమహల్‌ని అక్బరు కట్టించాడని అన్నాట్ట. కాదన్నందుకు చిరంజీవిని కొట్టాడు. తాజమహల్ నిర్మాత గురించి తప్పు చెప్పినందుకో సారి, అకారణంగా తన్ను కొట్టినందుకు, మరోసారి వెరసి రెండుసార్లు చిరంజీవి, చినబాబును కొట్టుండాలి. కాని సగటు మనిషికి వచ్చే సగం కోపంవల్ల, మా చిరంజీవి సగంసారి మాత్రమే మీ చినబాబును కొట్టేడు. ఎందుక్కొట్టాడో మీ చినబాబు, మీకు సరైన కారణం చెప్పుండడు. మా బోటివాళ్ళకు తమ తప్పును ఒప్పుకొనేంత ఆత్మస్థైర్యం, నిజాయితీ వుండని కారణంచేత, తరతరాలుగా వస్తున్న పిరికితనంచేత మీరు కూడా అడిగుండరు, సహజంగా జీర్ణించుకొనిపోయిన అహంకారంవల్ల, అజ్ఞానంచేత. కాని, అవమానాన్ని, అభిమానాన్ని దాచుకోలేని సగటు మనిషి రక్తంగనుక చిరంజీవి నిజాయితీగా జరిగింది చెప్పాడు. ఆ నిజాయితీ ఫలితం మీరు చూసేరు. మీరు చూపిన ఆ నిజాయితీ ఫలితం, నాకీ ట్రాన్స్‌ఫర్ చేయించడం ద్వారా మీరు చూపించేరు. అందుకే ధన్యవాదాలు చెప్పడానికొచ్చాను.

బురదలో పుట్టిన పద్మం, బురదను అసహ్యించుకోదు. అది దాని జన్మస్థానం కనుక. జన్మభూమి అతిపేదది, అతివికృతమైనది, అతి నిరుపయోగమైనదీ కావచ్చు. కాని అక్కడ పుట్టిన ప్రాణికి అది అపూర్వమైనదనిపిస్తుంది. అక్కడి అణువణువు సత్యాన్ని చూపుతుంది, స్పందింపజేస్తుంది. చలింపజేస్తుంది. అందుకే కవులు 'జననీ జన్మభూమిశ్చ' అన్నారు.

మీరు అతిసునాయాసంగా, అతిక్లిష్టమైన ప్రాంతానికి ట్రాన్స్‌ఫర్చేయించిన ఆ ఊరు, నా స్వంత ఊరు. అలాటప్పుడు, ఇక ఆదెలాటిదైనా పర్వాలేదని, నిశ్చింతగా జీవితాన్ని వెళ్ళమార్చగలనవి, కొంతకాలమైన మా ప్రాంతంలో మా వాళ్ళతో కాలం గడిపే అవకాశం కలిపించినందుకు సంతోషంతో పొంగిపోతూ, ఆ సంతోషాన్ని మీ క్కూడ పంచుదామని, కృతజ్ఞతలు చెప్పుకొందామని వచ్చాను. నా కంటె ముందుగా ఈ సంతోష వార్తను విని, ఆ సంతోష వార్తని, మీ భార్యా పిల్లలతో పంచుకొంటున్నందుకు సంతోషిస్తున్నాను.

అన్నట్టు మరో విషయం. ఎంతోకాలంగా నే నీ ట్రాన్స్‌ఫర్ కోసం ప్రయత్నిస్తున్నాను. కాని ఆఫీసర్లవారి అనుగ్రహం కలగలేదు. మా వాడు, మీ వాణ్ణి కొట్టిన వెంటనే ఈ ట్రాన్స్‌ఫరార్డరు చెట్టుకు పండిన పండులా తప్పున రాలింది. గుర్తుంచుకొంటాను. ఇక ముందు అవసరమైనపుడు 'నేనే' స్వయంగా మిమ్మల్ని కలుస్తాను. వస్తాను.... గుడ్ బై"

రామనాధం గంభీరంగా లేచి తాపీగా నడుస్తూ గేటుదాటి రోడ్డుమీదికి నడిచాడు.

పెదబాబుగారు నోట్లో కాఫీని పుక్కిలించి ఊసేసి, ఫోన్వైపు పరుగెత్తారు. □


వచ్చేనెల నవలానుబంధంలో

నవలల పోటీలో మూడవ బహుమతి పొందిన నవల

'కడలి అంచు కాపురం'

పాలకోడేటి సత్యనారాయణరావు రచన

చదవండి



